సాక్షి పార్వతీపురం మన్యం

సోమవారం | 12 | ఆగస్టు | 2024



పైనాపిల్‌లో కొత్తరకం

పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో విస్తృతంగా పండే ప్రధాన పంటల్లో పైనాపిల్ ఒకటి.

- 8లో



రైలు ప్రయాణికులకు 'మదద్'

రైలులో ప్రయాణించే వారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే ఫిర్యాదు చేసేందుకు 'రైల్ మదద్' యాప్‌ను రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది.

- 8లో

నేటి గ్రీవెన్స్‌లో మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం: రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మేరకు కలెక్టరేట్ వర్గాలు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశాయి. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందించాలని అధికారులు కోరారు.

న్యూస్‌రీల్

తోటపల్లి నీరు విడుదల



తోటపల్లి కాలువ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరావు

చీపురుపల్లి: తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీటిని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఆదివారం విడుదల చేసారు. మండలంలోని నాగంపేట సమీపంలో గల 96.52 కిలోమీటరు వద్ద తోటపల్లి సాగునీటిని విడుదల చేసారు. అంతకుముందు పసుపు, కుంకుమలతో తోటపల్లి కాలువ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు తోటపల్లి నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల కోసం ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వట్టిగెడ్డ నీరు విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ నుంచి సాగునీటిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగునీరు విడుదల చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్‌తో పాటు టీడీపీ నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, పల్ల రాంబాబు, దేవకోటి వెంకట నాయుడు, గురాన శ్రీరామమూర్తి, మూడడ్ల సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయ పనుల పరిశీలన



విమానాశ్రయ పనులను పరిశీలిస్తున్న కేంద్ర విమానాశ్రయ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

భోగాపురం: భోగాపురంలో జరుగుతున్న అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంతో పాటు టెర్మినల్, ఏటీసీ, రన్‌వే నిర్మాణ పనులను కేంద్ర విమానాశ్రయ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదివారం పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని జీఎంఆర్, ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో కేంద్ర విమానాశ్రయ శాఖ మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్‌బీయూ సర్వే..



ఎన్‌బీయూ సర్వే, యాప్‌లో నమోదు తీరును పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

డెంకాడ: నైబర్‌హుడ్ బిజినెస్ యూనిట్ సర్వేను (ఎన్‌బీయూ) పక్కాగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని జొన్నాడ గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం సహాయ సంఘ సభ్యుల పిల్లల విద్యార్హత, ఉపాధి వివరాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీపీఎం ఎల్‌హెచ్ ఎం.జయశ్రీ, డీపీఎం రవి, ఏసీ రాజ్‌కుమార్, ఏపీఎం విజయలక్ష్మి, గ్రామ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 50 డివిజన్‌లకు చెందిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను అర్జీల రూపంలో తెలికజేయవచ్చని పేర్కొన్నారు.

గిరిజనం ఆశలపై నీళ్లు



- ప్రైవేటుకే వైద్యకళాశాల బాధ్యతలు
- పీపీపీ విధానంలో నిర్మాణానికి ప్రభుత్వం యోచన
- ఆందోళనలో ఆదివాసీ సంఘాలు, గిరిజనులు

సాక్షి, పార్వతీపురం మన్యం: ఏజెన్సీ వాసులకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోనున్న పరిస్థితులు గోచరిస్తున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో సరైన వైద్య సదుపాయాలు లేక, అత్యవసర సమయంలో రోగులను విజయనగరం, విశాఖ కేజీహెచ్‌లకు తరలించాల్సి వస్తోంది. జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసింది. మౌలిక సదుపాయాలను మెరుగుపర్చింది. దీంతోపాటు..జిల్లాకో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు చేస్తామన్న నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి..ప్రభుత్వం అందుకనుగుణంగా మన్యం జిల్లాలో రూ.600 కోట్లతో నిర్మాణానికి సంకల్పించింది. ఇందుకోసం పలుచోట్ల అనువైన స్థలాలనూ అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఈ నేపథ్యంలో పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల వద్ద వైద్య కళాశాల నిర్మాణానికి ఏకాభిప్రాయానికి వచ్చారు. అనుమతులు రాగానే పనులు చకాచకా మొదలైపోతాయని అంతా భావించారు. అయితే ఈలోగా ప్రభుత్వం మారడంతో జిల్లా ప్రజలు ఆశలు ఆవిరైపోయాయి.

మార్గమధ్యంలోనే ప్రాణాలు గాలిలోకి..

జిల్లాలో 37 పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌సీలు, మూడు ఏరియా ఆస్పత్రులున్నాయి. ఒక్క జిల్లా ఆస్పత్రిలోనే రోజుకు 500కు పైగా ఓపీ నమోదవుతోంది. మొత్తం పీహెచ్‌సీల్లో రోజుకు 3 వేల నుంచి 3,500 వరకు ఓపీ ఉంటోంది. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ఆస్పత్రి ఒక్కటే దిక్కవుతోంది. అక్కడా కొన్ని రకాల సేవలు అందడం లేదు. దీంతో విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్న పని. అంతదూరం వెళ్లేలోగా..మార్గమధ్యంలో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న ఉదంతాలు అనేకం. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణమైతే ఇక్కడే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుతాయి. వైద్యులు, వైద్యసిబ్బంది సంఖ్య పెరుగుతుంది. ఎంఆర్‌ఐ, సీటీస్కాన్, డిజిటల్ ఎక్స్‌రే వంటి అధునాతన పరికరాలు అందుబాటులో ఉంటాయి. పల్మనాలజీ, న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జన్, పెథాలజీ, నెఫ్రాలజీ వంటి వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉంటారు. ఈ వైద్యసేవలన్నీ ప్రజలకు ఉచితంగానే అందుతాయి. ఇవే సేవలను ప్రైవేట్ భాగస్వామ్యంతో చేస్తే..పేద రోగులకు వ్యయప్రయాసలు తప్పవని గిరిజన సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ వాసుల పేదరికాన్ని, అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తరఫునే వైద్యకళాశాలను త్వరితగతిన నిర్మించాలని కోరుతున్నారు.

కూటమి నిర్ణయంతో షాక్..

మన్యం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటైతే..ఇటు జిల్లాతోపాటు, అటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పేద విద్యార్థులు, గిరి పుత్రులకూ వైద్యవిద్య అందుబాటులోకి వస్తుంది. తాజాగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలను పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) విధానంలో నిర్మించేందుకు యోచిస్తోంది. ఈ విషయమై ఇటీవల జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అదే జరిగితే.. మున్ముందు జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మించినా, అది ప్రైవేట్ భాగస్వామ్యంతోనేనని ఆదివాసీ సంఘాలు భావిస్తున్నాయి.

జిల్లాలోకి ఏనుగుల గుంపు



ఏనుగుల గుంపును పర్యవేక్షిస్తున్న అటవీశాఖ అధికారులు, ఎలిఫెంట్ ట్రాకర్స్, పోలీస్ సిబ్బంది

- వి.వి.ఆర్‌పేట పంటపొలాల్లో తిష్ట
- పిల్లకు జన్మనిచ్చిన ఓ ఏనుగు

వంగర: మండలంలోని వి.వి.ఆర్‌పేట గ్రామ సమీపంలోకి ఏనుగుల గుంపు ప్రవేశించింది. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కెల్ల సమీపంలో ఉన్న ఆరు ఏనుగుల గుంపు నాగావళి నది దాటుకొని ఆదివారం ఉదయం వి.వి.ఆర్‌పేట గ్రామ సమీపంలోని శివాలయం మీదుగా పంట పొలాల్లోకి ప్రవేశించాయి. మొక్కజొన్న, వరి, చెరకు, పామాయిల్ పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరు ఏనుగుల గుంపులో ఒక ఏనుగు పిల్లకు జన్మనిచ్చింది. చిన్న ఏనుగు పిల్లతో సహా ఏడు ఏనుగుల గుంపు అయింది. ప్రస్తుతం వి.వి.ఆర్.పేట - పెదరాజులగుమ్మడ గ్రామాల మధ్య పంట పొలాల్లో ఏనుగుల గుంపు తిష్ట వేశాయి. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వంగర పోలీసులతో పాటు బొబ్బిలి ఎఫ్‌డీవో స్వప్న, ఎలిఫెంట్ ట్రాకర్స్ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపును కవ్వించొద్దని, అలా చేస్తే ప్రజల ప్రాణాలకు ప్రమాదమని పేర్కొన్నారు. ప్రతీ ఏటా ఏనుగులు తమ గ్రామాల్లో ప్రవేశించి పంటలను నష్టపరుస్తున్నాయని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులతో పాటు సర్పంచ్ బత్తిన గురువులు, ఉప సర్పంచ్ మరిచెర్ల విజయలక్ష్మి, ఎంపీటీసీ బంగారపు కాంతారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించి తమ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.



అప్పుడే పుట్టిన ఏనుగు పిల్లను రక్షించుకుంటున్న ఏనుగులు

జీఓ 117 రద్దు చేశాకే సర్దుబాటు

- ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: జీఓ నెంబర్ 117 రద్దు చేశాకే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ నేతలు పలువురు మాట్లాడారు. విద్యాశాఖలో అన్ని క్యాడర్లలో పదోన్నతులు కల్పించి సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తొలిత తీర్చి ఆ తర్వాత మాత్రమే వర్క్ అడ్జస్ట్మెంట్ చేయాలని పేర్కొన్నారు. సీబీఎస్‌ఈ విధానాన్ని రద్దుచేసి రాష్ట్రం మొత్తం ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో రద్దు చేసిన ప్రధానోపాధ్యాయ పోస్టులను కేటాయించాలన్నారు. అన్ని యూపీ స్కూళ్లల్లో పీఈటీ పోస్టు కేటాయించాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలలకు పీఎస్, హెచ్.ఎం పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలు రెండు కొనసాగించాలని, మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కి పంపాలని కోరారు. 8, 9, 10 తరగతులకు సోషల్ సిలబస్‌కు సరిపడే పీరియడ్లను అకడమిక్ క్యాలెండర్‌లో చూపించాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆయా తరగతుల విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ కర్రి రవి, జిల్లా బాధ్యులు మజ్జి రమేష్, బడే సుగుణాకర్ నాయుడు, కర్రి కోటేశ్వరరావు, జె.బి.జగదీశ్వరరావు, రషీద్‌తో పాటు పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వివాదాస్పద కొటియాలో..

ఒడిశా దూకుడు



పగులుచెన్నేరులో ఒడిశా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇంటింటికీ వేస్తున్న కొళాయి లైన్లు

- ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపడుతున్న అక్కడి ప్రభుత్వం
- స్తబ్ధంగా ఉన్న ఆంధ్రా ప్రభుత్వం

సాలూరు: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది. అక్కడి గ్రూప్ గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపడుతూ దూసుకుపోతుంటే ఆంధ్రా ప్రభుత్వం స్తబ్దంగా ఉంటూ చోద్యం చూస్తోంది. వివాదాస్పద పట్టుచెన్నేరు, పగులుచెన్నేరు, కోనదొర, సొల్పగుప్ప, ముడకారు తదితర గ్రామాల్లో మూడేసి చొప్పున రిగ్ బోర్లను ఒడిశా ప్రభుత్వం ఇటీవల వేసింది. బోర్లు వేసి ఇంటింటికి తాజాగా పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తోంది. పలు గ్రామాల్లో సోలార్ ల్యాంపులను ఇటీవల ఒడిశా ప్రభుత్వం అందించినట్లు స్థానిక గిరిజనులు చెబుతున్నారు. కాగా ఇంతవరకు గంజాయిభద్ర పంచాయతీలోనే అధికంగా పట్టుచూపించిన ఒడిశా ప్రభుత్వం తాజాగా పట్టుచెన్నేరు, పగులుచిన్నేరు పంచాయతీల మీద దృష్టిపెట్టి అభివృద్ధి పనులు చేపడుతుండడం గమనార్హం. ఈ గ్రామాల వివాద పరిష్కారానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఒడిశా వెళ్లి నాటి సీఎం నవీన్‌పట్నాయక్‌తో చర్చలు జరిపిన విషయాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.ఆ సమయంలో నియోజకవర్గంలో టీడీపీ నానా రాద్ధాంతం చేసిన అంశాలపై మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో కొటియా గ్రామాల వివాద పరిష్కారానికి టీడీపీ కూటమి నాయకులు చొరవ తీసుకుంటారా? తీసుకోరా? అని చర్చించుకుంటున్నారు.



ఒడిశా ప్రభుత్వం ఆధ్వర్యంలో తీస్తున్న రిగ్‌బోర్లు (ఫైల్)

ఇప్పుడైనా స్పందిస్తారా?

గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొటియా వివాదాన్ని పట్టించుకోలేదని, నేడు ఒడిశాలో కూడా టీడీపీ కూటమికి సహకరిస్తున్న బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరిన నేపథ్యంలో కొటియా గ్రామాల వివాద పరిష్కారానికి ఆంధ్రా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. కాగా సాలూరు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఉన్న సంధ్యారాణి, ఈ గ్రామాల వివాదానికి తెరదించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని కొటియా గ్రామాల ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

ఐటీడీఏ పీవో బదిలీ నిలిపివేయాలి



అత్యవసరంగా సమావేశమైన జేఏసీ నాయకులు

- ఆదివాసీ జేఏసీ విజ్ఞప్తి

సీతంపేట: ఐటీడీఏ పీవో టి.రాహుల్‌కుమార్‌రెడ్డి బదిలీని నిలుపుదల చేయాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనాభివృద్ధి కోసం మంచి విజన్‌తో పనిచేస్తున్న ఐఏఎస్ ఆఫీసర్‌ను ఆకస్మికంగా బదిలీ చేయడం ఆదివాసీలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఇక్కడే ఆయనను పీవోగా కొనసాగించాలని గిరిజన మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు హెచ్.రామస్వామి, సవర మోహన్‌పాల్, ఎం.విశ్వనాథం, బి.రామమోహన్, సవర రాజేష్, నరేష్, అరుణ్, కృష్ణ, చిరంజీవి, బాబురావు, సురేష్, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైరల్‌తో వణుకు

- పల్లెలు, పట్టణాల్లో పెరుగుతున్న జ్వరపీడితులు
- రోగులతో ఆస్పత్రులు కిటకిట
- జిల్లాలో ఇప్పటి వరకు 430 మలేరియా, 95 డెంగీ కేసుల నమోదు
- వైరల్ జ్వరాల బారిన 2.20 లక్షల మంది

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు జ్వరపీడితులతో వణుకుతున్నాయి. చికిత్స కోసం వచ్చే రోగులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాల వద్ద కొందరు వైద్యం చేయించుకోగా, మరికొందరు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వైద్యం కోసం క్యూ కడుతున్నారు. మరోవైపు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో టైఫాయిడ్, వైరల్, మలేరియా, డెంగీ జ్వరాలు సోకిన రోగులు అధిక సంఖ్య లో చికిత్స పొందుతున్నారు. రోగులు అధిక సంఖ్య లో వస్తుండడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులకు కూడా చికిత్స అందిస్తున్నారు. పెద్దలతో పాటు పిల్లలు ఎక్కువగా జ్వరాలు బారిన పడుతున్నారు.

జిల్లాలో 2.20 లక్షల జ్వర కేసుల నమోదు

జిల్లాలో లక్షలాది మంది జ్వరాల బారిన పడ్డారు. ముఖ్యంగా ఈ ఏడాది జనవరి నెల నుంచి జూలై వరకు 2.20 లక్షల మంది జ్వరాల బారిన పడ్డారు. జిల్లాలో మలేరియా కేసులు ఇప్పటివరకు 430 నమోదయ్యాయి. అదేవిధంగా 95 డెంగీ కేసులు కూడా నమోదయ్యాయి. టైఫాయిడ్ కేసులు 600 వరకు నమోదు అయ్యాయి.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

డెంగీ కేసుల వివరాలు...

నెల	కేసుల సంఖ్య
జనవరి	14
ఫిబ్రవరి	10
మార్చి	17
ఏప్రిల్	10
మే	12
జూన్	11
జూలై	21

మలేరియా కేసుల వివరాలు

నెల	కేసుల సంఖ్య
జనవరి	24
ఫిబ్రవరి	35
మార్చి	55
ఏప్రిల్	65
మే	78
జూన్	85
జూలై	88

సెప్టెంబర్, అక్టోబర్‌ల్లో కేసుల పెరిగే అవకాశం

రానున్న రోజుల్లో జిల్లాలో వ్యాధుల వ్యాప్తి మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో ప్రస్తుతం వైరల్, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఇవి మరింత పెరిగే అవకాశం ఉంది.

భయపెడుతున్న మలేరియా, డెంగీ

ఇదిలా ఉంటే జిల్లాలో నమోదవుతున్న మలేరియా, డెంగీ కేసులు ప్రజలను మరింత భయపెడుతున్నాయి. గతంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా కేసులు అధికంగా నమోదయ్యేవి. ప్రస్తుతం మైదాన ప్రాంతాల్లో కూడా మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. డెంగీ కేసులు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో నమోదవుతుండడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొంటున్నాయి. వీటి బారిన పడిన వారు రోజుల తరబడి ఆస్పత్రుల్లో చికిత్స పొందాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

కట్టడికి చర్యలు

జిల్లాలో వ్యాధులు వ్యాప్తి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో తొలి విడత స్ప్రేయింగ్ పూర్తయింది. రెండో విడత చేపడుతున్నాం. ఆరోగ్య సిబ్బందితో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నాం. జ్వర పీడితులు ఉంటే రక్తపూతలు తీసి మలేరియా, డెంగీ పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

ప్రైవేటు ఆస్పత్రుల్లో..

జ్వర పీడితులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే... లేనిపోని వైద్య పరీక్షలు రాసి దోపిడీకి పాల్పడుతున్నారు. అవసరం ఉన్నా.. లేకున్నా... వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. దీంతో వ్యాధి నిర్ధారణకే రూ.వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇన్‌పేషంట్ చికిత్సకైతే మరింత అధికంగా ఫీజులు గుంజేస్తున్నారు. సాధారణ జ్వరానికి సైతం రూ.వేలల్లో రోగులు ఖర్చు చేస్తున్నారు.

ఈ ఏడాది జనవరి నుంచి జూలై నెల వరకు నమోదైన జ్వరపీడితుల సంఖ్య

జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జూలై
10,200	15,400	20,658	35,550	40,650	45,600	51,942

క్లుప్తంగా

ప్రబంధ మండలి పుస్తకావిష్కరణ



ప్రబంధ మండలి పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం ప్రముఖ అవధాని డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం రాసిన ప్రబంధ మండలి గ్రంథాన్ని డాక్టర్ ఉలిమిరి సోమయాజులు ఆవిష్కరించారు. కౌముది పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి సంస్థ వ్యవస్థాపకుడు ధవళ సర్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. గ్రంథ సమీక్షను డాక్టర్ జక్కు రామకృష్ణ చేశారు. నేటి సమాజానికి, ముఖ్యంగా యువతరానికి పనికి వచ్చే ఎన్నో విషయాలు గ్రంథంలో నిక్షిప్తమయ్యాయని చెబుతూ గ్రంథం రాయడానికి దారితీసిన సన్నివేశాలను, అంశాలను గ్రంథకర్త వివరించారు. కార్యక్రమంలో మానాప్రగడ సాహితి, చెరుకూరి శ్రీధర్, సరిపల్లి సోమేశ్వరరావు, టీవీ.శ్రీనివాస్, కూర్మెళ్ల సరోజిని తదితరులు పాల్గొన్నారు.

2000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

- రెండు లీటర్ల సారాతో పట్టుబడిన మహిళ



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామ సమీపంలో రెండువేల లీటర్ల సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం కొత్తవలస సీఐతోపాటు వల్లంపూడి ఎస్సై, సిబ్బంది కృష్ణారాయుడుపేట సమీపంలోని తోటల్లో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన రెండు వేల లీటర్లు బెల్లం ఊటను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అనంతరం రెండు లీటర్ల సారాతో పట్టుబడిన మహిళను అదుపులోకి తీసుకున్నారు. సారాతో పాటు పట్టుబడిన బెల్లం ఊట కూడా ఆ మహిళదేనని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి



సత్యనారాయణ మృతదేహం

గంట్యాడ: మండల కేంద్రానికి చెందిన ఏలూరు సత్యనారాయణ ఈనెల 6వతేదీన తన ఇంటి నుంచి టీవీఎస్ వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొట్టడంతో గాయపడ్డాడు. ఈ విషయం గమనించిన స్థానికులు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంట్యాడ పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..



ప్లాట్‌ఫామ్ నంబర్4లో గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నంబర్ 4లో సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉన్నట్లు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ ఆదివారం తెలిపారు. మృతుని శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. నీలం రంగు షర్ట్, కాఫీరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, మృతుని వద్ద తెలుపు రంగు పువ్వుల డిజైన్ కలిగిన ఆకుపచ్చ రంగు దుప్పటి ఒకటి ఉందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ తెలిపారు.

కాలువలో పడి వృద్ధుడు..

విజయనగరం క్రైమ్: స్థానిక పూల్‌బాగ్ అయ్యప్పనగర్ వద్ద మద్యం తాగిన మత్తులో కాలువ గట్టుపై నుంచి కింద పూల్‌బాగ్ కాలనీకి చెందిన వృద్ధుడు కారి నరసింహ (70) మృతిచెందినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹98	₹166	₹176

పైనాపిల్‌లో కొత్తరకం

- మారిషస్ వెరైటీవైపు మొగ్గు
- పంపిణీకి ఉద్యానవన అధికారుల కసరత్తు
- వంద ఎకరాల్లో విస్తరించడానికి ప్రణాళికలు
- కేరళ నుంచి రానున్న కొత్తరకం మొక్కలు



ఎక్కువ కాలం నిల్వ ఉండని సింహాచలం వెరైటీ పైనాపిల్



గతంలో ఇచ్చిన క్యూ వెరైటీ రకం పైనాపిల్ పంట

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో విస్తృతంగా పండే ప్రధాన పంటల్లో పైనాపిల్ ఒక్కటి. దాదాపు 10 వేల ఎకరాల్లో ఈ పంట విస్తరించి ఉంది. ఏటా 200 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. గిరిజనులు అనాదిగా సింహాచలం వెరైటీ మొక్కలను వేస్తున్నారు. ఇది లోకల్ వెరైటీ కావడంతో ఎక్కువగా కొండపోడు వ్యవసాయంలో గిరిజనులు పండిస్తున్నారు. ఈ రకం పంట దిగుబడి బాగున్నప్పటికీ ఎక్కువ రోజులు నిల్వ ఉండకపోవడం, దీని రసం దిగుబడి, రుచి పెద్దగా ఉండక పోవడం వంటి కారణాలతో దీని వల్ల పెద్దగా గిరిజనులకు ఆదాయ మార్గాలు ఉండడం లేదని ఐటీడీఏ, ఉద్యానవనశాఖాధికారులు భావించి నూతన రకాన్ని పరిచయం చేయనున్నారు. గిరిజనులకు ఆదాయమార్గాలు ఎక్కువగా వచ్చే రకాలపై దృష్టిసారిస్తున్నారు.

100 ఎకరాల్లో మారిషస్ వెరైటీ..

దాదాపు 100 ఎకరాల్లో సీతంపేట, భామిని మండలాల్లో కొత్త వెరైటీ అయిన మారిషస్ పైనాపిల్ సక్కర్స్‌ను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. మరో పక్షం రోజుల్లో రైతులను ఎంపిక చేసి 90 శాతం రాయితీపై వాటిని సరఫరా చేస్తారు. ఈ మేరకు దరఖాస్తులు స్వీకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కొత్త రకమైతే ఎక్కువగా జ్యూస్‌తో పాటు నిల్వ కూడా ఉంటుందని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో మొక్క రూ.19లకు కొనుగోలు చేసి రైతులకు కేవలం రూపాయి నుంచి రూపాయిన్నరకు ఇవ్వనున్నరు

ఫలితమివ్వని క్యూ వెరైటీ..

రెండేళ్ల కిందట క్యూ వెరైటీని అధికారులు సరఫరా చేశారు. అది పెద్దగా ఈ వాతావరణానికి అనుకూలించలేదు. దీంతో ఈ వెరైటీని పెద్దగా రైతులు పండించలేదు. ఉద్యానవనశాఖ రూ.13 వంతున ఒక్కో మొక్కను కొనుగోలు చేసి దాదాపు రూ.14 లక్షల వరకు వెచ్చించినా ఫలితం లేకపోయింది.



కొండపోడులో పైనాపిల్ పంట

క్షేత్రస్థాయిలో 10 శాతం కూడా పంట వచ్చినట్లు కనిపించలేదు. ప్రస్తుతం ఇవ్వనున్న మారిషస్ వెరైటీ ఏ మేరకు ఫలితాలు ఇస్తుందో వేచిచూడాలని రైతులు తెలియజేస్తున్నారు.

జ్యూస్ కంటెంట్ ఎక్కువ

జ్యూస్ కంటెంట్ ఎక్కువగా ఉండే మారిషస్ వెరైటీకి మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో ఆ రకానికి ప్రోత్సాహం ఇవ్వనున్నాం. ఇదే కాకుండా ఇంకా ఏఏ వెరైటీలు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయో పరిశీలిస్తున్నాం. పైనాపిల్‌లో మారిషస్ వెరైటీ ఈ ఏడాది నుంచి పరిచయం చేసి వేల్యూ అడిషన్ జరిగేలా చూస్తాం.

పేడాడ జయశ్రీ, హార్టికల్చర్ ఆఫీసర్, సీతంపేట

రైలు ప్రయాణికులకు ‘మదద్’

- సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు యాప్



రైల్ మదద్ యాప్

పార్వతీపురం: రైలులో ప్రయాణించే వారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే ఫిర్యాదు చేసేందుకు ‘రైల్ మదద్’ యాప్‌ను రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ప్రయాణికుల భద్రతకు సంబంధించి వివిధ రకాల సేవల నిమిత్తం టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకు వచ్చింది. తాజాగా ప్రయాణికుల విషయంలో మరింత జవాబుదారీ తనంగా వ్యవహరించేందుకు వినూత్న కార్యక్రమానికి రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా ఈ యాప్‌లో స్టేషన్‌లో అపరిశుభ్రత, రైలులో భద్రత, సిబ్బంది నిర్లక్ష్యం ఇలా 35 రకాల సమస్యలపై ఫొటోలు అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుచేస్తే ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరిస్తారు. అయితే ఫిర్యాదు చేసే వ్యక్తి రిజర్వేషన్ లేదా జనరల్, ప్లాట్‌ఫాం టికెట్లలో ఏదో ఒకటి కలిగి ఉండాలి. అప్పుడే సమస్యలపై ఈ యాప్‌లో ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉంటుంది.

చేయాల్సిన ఫిర్యాదులు

రైల్వేస్టేషన్లలో అపరిశుభ్ర వాతావరణం, రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండడం, నీటి కొరత, వెయిటింగ్ హాల్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడం, రైలు సిబ్బంది నిర్లక్ష్యం, టీటీఈ ఇతర సిబ్బంది అవినీతి, దురుసు ప్రవర్తన, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, గొలుసు దొంగతనాలు, వస్తువుల అపహరణ, మద్యం తాగడం, కొట్లాట, పొగ, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన కలిగి ఉండడం, బోగీల్లో అపరిశుభ్రత, ఆకతాయిల వేధింపులు, మరుగుదొడ్లు, ఏసీ, ఫ్యాన్లు, లైట్లు, నాణ్యత లేని ఆహారం, అధిక ధరలకు తిను బండారాల అమ్మకం, బెడ్ రోల్స్ అపరిశుభ్రంగా ఉండడం, చార్జింగ్ పాయింట్లు పనిచేయకపోవడం, రైలు రాకపోకల్లో ఆలస్యం వంటి సమస్యలపై ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

రైలు ప్రయాణికులు ముందుగా గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. ఈ యాప్‌లో వ్యక్తిగత వివరాలు, సెల్‌ఫోన్ నంబర్, ఈ–మెయిల్ తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. మీ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ యాప్ ద్వారా సంబంధిత అధికారులకు సూచనలు సలహాలను అందించవచ్చు. యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాగానే ఎస్‌ఎంఎస్/ ఈ–మెయిల్ ద్వారా సమాచారం అందిస్తారు.

గంజాయి పీలుస్తున్న ముగ్గురిపై కేసు

విజయనగరం క్రైమ్: స్థానిక గాజులరేగ రైల్వే ట్రాక్ పక్కన గంజాయి పీలుస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. లంకాపట్నానికి చెందిన పొట్నూరు రాజశేఖర్, బలరాం, ధర్మపురికి చెందిన మరిచర్ల చిట్టిబాబులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

‘కెంబూరి’ కుటుంబానికి పరామర్శ



కెంబూరి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకరరావు

చీపురుపల్లి: మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే కెంబూరి రామ్మోహనరావు కుటుంబాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు పరామర్శించారు. ఆదివారం పట్టణంలోని లావేరురోడ్‌లోని కెంబూరి నివాసానికి వచ్చిన ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు ముందుగా రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు, రామ్మోహన్‌రావు బావమరిది, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కిమిడి గణపతిరావు, కెంబూరి సోదరులు లక్ష్మణమోహన్, భరత్ మోహన్‌తో మాట్లా డుతూ రామ్మోహనరావు మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా రామ్మోహనరావుతో తనకు చక్కని అనుబంధం ఉండేదని, కొద్దిరోజుల క్రితం కూడా తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు కుటుంబ సభ్యులకు శంకరరావు వివరించారు.

లేబర్ చట్టాలు, వేతనాలు అమలు చేయాలి

- హైర్ బస్ డ్రైవర్స్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న తులసీరామ్

విజయనగరం ఫూల్‌బాగ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న హైర్ బస్ డ్రైవర్లు, కాంట్రాక్ట్ కార్మికులకు లేబర్ చట్టాలు, కనీస వేతనాలు అమలు జరిగే విధంగా డిపో మేనేజర్లు బాధ్యత వహించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసి రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంచే చేను మేసినట్లు అన్న చందాన ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్లు, కాంట్రాక్ట్ వర్కర్ల పరిస్థితి ఉందని, గత 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నప్పటికీ లేబర్ చట్టాలు, కనీస వేతనాలు అమలు కావడం లేదని, హైర్ బస్ యజమానులు, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, సర్క్యులర్ ప్రకారం జీతం, వీక్లీ ఆఫ్‌లు, ప్రభుత్వ సెలవులు అమలు చేయడం లేదని వాపోయారు. అద్దె బస్ టెండర్‌లో పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని ఉన్నా పట్టించుకోవడం లేదని, డిపో మేనేజర్‌కు విన్నవించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, డ్రైవర్లకు రూ.27500 బేసిక్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రవాణా శాఖ మంత్రికి, కార్మిక శాఖ కమిషనర్‌కు నివేదించామని తెలిపారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎ.జగన్ మోహన్ రావు, అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సురేష్, డిపో అధ్యక్ష కార్యదర్శులు మధు, వాసు, కోశాధికారి ధనుంజయ, కోటి తదితరులు పాల్గొన్నారు.

నెటిజన్లూ ఖబడ్దార్..!

- సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు
- అకౌంట్స్ పర్యవేక్షణకు ప్రత్యేక బృందం
- ఎస్పీ వకుల్ జిందాల్



వకుల్ జిందాల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్: సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా అనుచితమైన పోస్టులు పెట్టి, విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ప్రకటనలో హెచ్చరించారు. సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వాస్తవాలను వక్రీకరిస్తూ మతాలు, కులాలు, పార్టీలను రెచ్చగొడుతూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, టెలిగ్రామ్, వాట్సాప్, లింకిడిన్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఎవరికి తోచిన విధంగా వారు పోస్టులు పెట్టి విద్వేషాలు రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై జిల్లా పోలీసు శాఖ నిఘా పెట్టిందని పేర్కొన్నారు. ఇందుకుగాను ఒక పోలీస్ బృందాన్ని ప్రత్యేకంగా నియమించి, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ బృందం అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకుంటూ, విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశంతో పోస్టులు పెట్టిన వారి వివరాలను రాబట్టి, వారికి నోటీసులు జారీచేసి, చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ఉపక్రమిస్తుందని స్పష్టం చేశారు.

వాస్తవాలు వక్కీకరించొద్దు

ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఒక ఎస్సై, టెక్నికల్ టీమ్ ఆరుగురు సభ్యులతో పనిచేస్తుందన్నారు. ప్రజలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వినియోగిస్తున్న సమయంలో విజ్ఞతతో వ్యవహరించాలని హితవు పలికారు. తాము పోస్టు పెట్టేటప్పుడు వాస్తవాలను వక్రీకరించడం, వాస్తవాలు తెలుసుకోకుండా పోస్టులు చేయడం వల్ల ఇతరుల మనోభావాలు దెబ్బతింటాయన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. సోషల్ మీడియాను పాజిటివ్ విషయాలను విస్తృతం చేసేందుకు, దూర ప్రాంతాల్లో ఉన్న మిత్రులు, బంధువులను దగ్గర చేర్చే విధంగా వినియోగించుకోవాలని కోరారు. యువత, ప్రజలు సోషల్‌మీడియను పాజిటివ్ కోణంలో వినియోగించుకుని, సాంకేతికతను అందిపుచ్చుకుని, నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. విద్వేషాలు రెచ్చగొడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా, వారిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరమైన కఠినచర్యలు తప్పవని నెటిజన్లను ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

వారంతే..!

రహదారి భద్రత..సురక్షిత ప్రయాణంపై ఎంతలా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నా..అంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతోంది. ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి..అన్నీ తెలిసిన వారే ఏమీ పట్టించుకోకుండా ఇష్టానుసారం రోడ్డుపై ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వారి ప్రాణాలకే కాకుండా ఎదుటివారిని కూడా ప్రమాదాలకు గురిచేస్తున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం











పచ్చ..పచ్చని చేలో..ఓ లాలా..!



భూమికి పచ్చాని రంగేసినట్టు..అని ఓ సినీ గేయరచయిత రాసిన గీతానికి అద్దంపట్టినట్లు ఉంది ఈ చిత్రం. మెరకముడిదాం మండలంలోని బుదరాయవలస నుంచి సోమలింగాపురం వెళ్లే ప్రధానరహదారిని ఆనుకుని రైతులు సాగుచేస్తున్న సుమారు 40 నుంచి 50 ఎకరాల వరిపంట పచ్చని తివాచీలా కనిపిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది.

-మెరకముడిదాం

16,17 తేదీల్లో ‘క్రీస్తు ఆగమన సిద్ధపడు’ సభలు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించే క్రీస్తు ఆగమన సిద్ధపడు సభలను విజయవంతం చేయాలని యేసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీసస్ బ్లెస్సింగ్ చర్చి విశ్వాసులు రెవరెండ్ నిర్మల సురగాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చర్చి ఆవరణలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ కళాభారతి వేదికగా జరిగే ఈ సభలకు జిల్లాలోని క్రీస్తు ఆరాధకులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెవరెండ్ మధుసూదన్ లోపింటి, రెవరెండ్ ఆంద్రేయ, పాస్టర్ జయరాజ్, రెవరెండ్ జాన్ వెస్లీ, సుబ్బారావు, నిర్మల క్రీస్తు ఆరాధకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

బొబ్బిలి రూరల్:

నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా మూలన పడి ఉన్నాయి. రైతులు తమ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నేరుగా వారి గ్రామం నుంచే పొందేందుకు ఈ ఆధునిక యంత్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రైతుభరోసా కేంద్రంలోను ఏర్పాటుచేసింది. బొబ్బిలి మండలంలోని 19 గ్రామాల్లో గల రైతుభరోసాకేంద్రాలతోపాటు పట్టణ పరిధిలో రైతులకు అందుబాటులో ఉండేందుకు వ్యవసాయశాఖ కార్యాలయంలో మరో మూడింటిని ఏర్పాటుచేసింది. డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించిన గత ప్రభుత్వం లక్షలాదిరూపాయలు వెచ్చించి వాటిని కొనుగోలు చేసింది. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతులు పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్‌ధరలు, దగ్గరలోఉన్న మార్కెట్ వివరాలు, తదితర అవసరమైన అన్ని సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయశాఖ అన్ని విధాలా అవగాహన కల్పించింది. వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు తదితర అంశాలు, ఏ సమయంలో ఏ పంట వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు అందించేవారు.కొత్త ప్రభుత్వంలో రైతుసేవాకేంద్రాల్లో దీని వినియోగంపై నిర్లక్ష్యం నీడలు కమ్ముకున్నాయి. కేవలం ఎరువులను మాత్రమే బుకింగ్ చేసుకునేందుకు వాడుతున్నారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుండగా వినియోగంలో లేని కియోస్క్ డిజిటల్ యంత్రాలు బూజుపట్టే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్‌సీజన్ దాదాపు పూర్తికావస్తోంది. రానున్న రబీ సీజన్‌కైనా వాటి సంపూర్ణ వినియోగానికి ప్రభుత్వం దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.



మూలకు చేరిన కియోస్క్ డిజిటల్ యంత్రాలు